

మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక


సంపుటి : 6 | సంచిక : 254 | పేజీలు : 8 | వెల : రూ.2/- గురువారం 08 అక్టోబర్ 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


రెపో రేటు 5.50 శాతానికి

పెంపు

● 25 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్‌బీఐ ● ఆగస్టులో ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరిక ● ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో నిర్ణయం ● ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం!! ● 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చు ● ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి ● ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడం తప్పదు ● ఎస్‌బీఐ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్



న్యూఢిల్లీ: మన జనప్రగతి అక్టోబర్ 07: వడ్డీ రేట్ల పెరుగుదలతో రుణాలు తీసుకున్న వారిపై అదనపు ఆర్థిక భారం పడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో కుటుంబ బడ్జెట్లు ఒత్తిడికి గురవుతున్న సమయంలో మిగతా2లో...



ఢిల్లీలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు

ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులతో భేటీ చాన్స్?

అమరావతి, మన జనప్రగతి అక్టోబర్ 07: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి పయనమయ్యారు. ఈరోజు మధ్యాహ్నం ఆయన హస్తినకు చేరుకోనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై, రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయన చర్చించనున్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి, ప్రధాని మోదీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో భేటీ కానున్నారు. ప్రధానంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు తక్షణ ఆమోదం తెలపాలని ఆయన ప్రధానిని కోరనున్నారు. అలాగే, ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితుల దృష్ట్యా సహాయక చర్యల కోసం మిగతా2లో...

నాపై దేశ ప్రజలకే ఎక్కువ హక్కు ఉంది

- కోట్లాది మంది విశ్వాసమే నా అతిపెద్ద బలం
- దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి
- విఘ్నహర్త ఆశీస్సులతో దేశం ప్రగతిపథంలో సాగాలి
- 25 ఏళ్ల ప్రస్థానంపై ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ: మన జనప్రగతి అక్టోబర్ 07: సీఎం, పీఎంగా 25 ఏళ్ల అధికార ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ తన రాజకీయ జీవితం, వ్యక్తిగత అనుభవాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, తన జీవితంలోని ప్రతి క్షణం, ప్రతి సంఘటన తనకు ఎన్నో విలువైన పాఠాలు నేర్పించాయని తెలిపారు. సాధించిన ప్రతి విజయం తనను మరింత ఉన్నత లక్ష్యాల వైపు నడిపించిందని అన్నారు.ప్రధాని మోదీ మాట్లాడుతూ, "దేశం నాకు ఎంతో ఇచ్చింది, కాబట్టి దేశం పట్ల నా బాధ్యత చాలా ఎక్కువ ఉంది. నాపై ప్రజలకే అత్యధిక హక్కు ఉంది. ఈ 25 ఏళ్ల అనుభవమే నా గొప్ప ఆస్తి. ఈ ఆస్తి మోదీకి కాదు, దేశానికి చెందుతుంది. మాతృభూమిలోని ప్రతి బిడ్డకు దానిపై హక్కు ఉంది" అని అన్నారు.ప్రధాని మోదీ మాట్లాడుతూ, "దేశం నాకు ఎంతో ఇచ్చింది, కాబట్టి దేశం పట్ల నా బాధ్యత చాలా ఎక్కువ ఉంది. నాపై ప్రజలకే అత్యధిక హక్కు ఉంది. ఈ 25 ఏళ్ల అనుభవమే మిగతా2లో...

మోదీ పాలనా ప్రస్థానానికి 25 ఏళ్లు

దేశాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్తున్నారు: లోకేశ్



అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 07: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆయనకు అభినందనలు తెలిపారు. గుజరాత్ నుంచి న్యూఢిల్లీ వరకు మోదీ ప్రయాణం దూరదృష్టి, నిర్ణయాత్మక నాయకత్వం, మిగతా2లో...


టెన్షన్.. టెన్షన్

ఢిల్లీలో ఉద్రిక్తంగా మారిన ఇండియా బ్లాక్ మార్చ్

ఎంపీలు, మహిళా కార్యకర్తల అరెస్టు.. పలువురికి గాయాలు



న్యూఢిల్లీ: మన జనప్రగతి అక్టోబర్ 07: ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా బ్లాక్ ఎంపీలు చేపట్టిన మార్చ్ బుధవారం ఉద్రిక్తంగా మారింది. ఢిల్లీలోని జనపథ్ నుంచి జంతర్‌మంతర్ వైపు వెళ్తున్న ఎంపీలు, కార్యకర్తలను అశోక్ రోడ్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఎంపీలు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ప్రియాంక గాంధీ నేతృత్వంలో పలువురు మహిళా ఎంపీలు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. నిరసనకారులను పోలీసులు అదుపులోకి మిగతా2లో...



తొలగించిన 46.62 లక్షల ఓట్లపై ప్రత్యేక పరిశీలన

- నేటి నుంచి ఇంటింటికీ బీఎల్ఓలు.. అర్హులైతే మళ్లీ ఓటరు జాబితాలోకి

అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 07: ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా పునఃపరిశీలనకు ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనుంది. గురువారం మిగతా2లో...

ఉత్తరాంధ్రకు పెట్టుబడుల ఊతం

- శ్రీకాకుళంలో విమానాశ్రయానికి భూమి క్లియరెన్స్.. భోగాపురంలో 800 ఎకరాల్లో ఏరో సిటీ



విశాఖపట్నం, మన జనప్రగతి అక్టోబర్ 07: ఉత్తరాంధ్రలో మౌలిక వసతులు, పారిశ్రామిక రంగానికి మరింత ఊతమిచ్చే కీలక ప్రకటనలు వెలువడ్డాయి. శ్రీకాకుళంలో విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన భూమికి ప్రభుత్వం క్లియరెన్స్ ఇచ్చిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మిగతా2లో...

హరితాంధ్రప్రదేశ్‌కు నర్సరీ రైతుల భాగస్వామ్యం

కడియం రైతులకు స్థిరమైన మార్కెట్ అవకాశాలు కల్పిస్తాం: నాగబాబు



2లో

పోరాటం ఆపేది లేదు

బీజేపీని దేశ ప్రజలు క్షమించరు..
మోదీ, అమిత్ షా నిరంకుశత్వం
ప్రజాస్వామ్యయుత ఆందోళనకు అడ్డు
సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌తో వైదొలగాలి
ప్రధాని మోదీ రాజీనామా చేయించాలి
ఢిల్లీ పోలీసులపై సీఎం రేవంత్ ఆగ్రహం



2లో

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

ఉత్తరాంధ్రకు పెట్టుబడుల ఊతం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు తెలిపారు. విమానాశ్రయాల ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఆయా ప్రాంతాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఆనందపురం మండలం గంభీరంలోని ఐఐఎంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర ప్రాంతీయ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో పలు కీలక ప్రాజెక్టులపై ప్రకటనలు వెలువడ్డాయి. అనకాపల్లిలో మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటుపై అధ్యయనం చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. భోగాపురంలో 800 ఎకరాల్లో జీఎంఆర్ ఏరో సిటీ అభివృద్ధి చేస్తున్నట్లు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్ వెల్లడించారు.

రూ.37 వేల కోట్లతో 229 ఒప్పందాలు 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రూ.22.6 లక్షల కోట్ల విలువైన 714 ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. వీటి ద్వారా 9.3 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. రూ.5 లక్షల కోట్ల విలువైన 257 ప్రాజెక్టులు నిర్మాణ దశకు చేరుకుంటున్నాయని చెప్పారు. ప్రస్తుత సదస్సులో రూ.37 వేల కోట్ల విలువైన 229 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు, వీటి ద్వారా సుమారు 92 వేల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.**విశాఖలో భారీ కన్వెన్షన్ సెంటర్** విశాఖలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో భారీ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించనున్నట్లు జిల్లా కలెక్టర్ అఖిషిక్త్ కిశోర్ తెలిపారు. భీమిలి బీచ్‌రోడ్డులోని యూనిటీ మాల్‌లో మరో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం జరుగుతోందన్నారు. విశాఖ ప్రాంతం నుంచే రాష్ట్ర పర్యాటక ఆదాయంలో సుమారు 50 శాతం వస్తోందని శ్రవణ్ షిప్పింగ్ అధినేత జి. సాంబశివరావు తెలిపారు.నక్కపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ రూ.1.35 లక్షల కోట్లతో భారీ ప్రాజెక్టును చేపడుతోందని మంత్రి టీజీ భరత్ తెలిపారు. గూగుల్, రిలయన్స్ సంస్థలు ఏఐ, డేటా సెంటర్ రంగాల్లో భారీ పెట్టుబడులు పెడుతున్నాయని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామిక ప్రాజెక్టుల ద్వారా ఉపాధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉందని సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు తెలిపారు.

తొలగించిన 46.62 లక్షల ఓట్లపై ప్రత్యేక పరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

నుంచి బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను మరోసారి పరిశీలించనున్నారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా తొలగించిన 46,62,583 మంది ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించనున్నారు. ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు తరలిపోయిన వారు, ఒకటికి మించి నమోదైన పేర్లు, అందుబాటులో లేని ఓటర్లను పరిశీలనలో గుర్తించారు. జూలై 31న 3,71,38,182 మంది ఓటర్లతో ముసాయిదా జాబితా విడుదలైంది. అనంతరం నోటీసుల దశలో మరో 1,73,071 మంది అనర్హులుగా గుర్తించినట్లు సీఈవో తెలిపారు. ఇంటింటి పరిశీలనలో అర్హత ఉన్న ఓటరు పేరు పొరపాటున తొలగించినట్లు తేలితే, సంబంధిత వ్యక్తికి ఫారం-6 ద్వారా మళ్లీ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అర్హులైన వారి పేర్లను నిరంతర సవరణ ప్రక్రియలో చేర్చనున్నారు.అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకుంటామని వివేక్ యాదవ్ తెలిపారు. ఎస్ఐఆర్-2026 తుది ఓటర్ల జాబితాను ఈ నెల 16న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తుది జాబితా విడుదలైన తర్వాత కూడా నిరంతర సవరణ ద్వారా అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

హరితాంధ్రప్రదేశ్‌కు నర్సరీ రైతుల భాగస్వామ్యం

రాజమహేంద్రవరం,మన జనప్రగతి అక్టోబర్ 07: రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడంలో నర్సరీ రైతుల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కె. నాగబాబు అన్నారు. రాజమహేంద్రవరం కడియంలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలో పచ్చదనాన్ని భారీగా పెంచేందుకు నర్సరీ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని నాగబాబు తెలిపారు. నర్సరీ రైతులకు స్థిరమైన మార్కెట్ అవకాశాలు కల్పించేం దుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. 202627 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా నర్సరీల్లో సుమారు 10 కోట్ల మొక్కలను సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు 500 నుంచి 1,000 వరకు నర్సరీలు అవసరమని పేర్కొన్నారు. రాజమహే ంద్రవరం పుష్కర నగరవనంలో రుద్రాక్ష, అరుదైన అండమాన్ పడాక్ మొక్కలను నాగబాబు నాటారు. అనంతరం కడియం నర్సరీలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి లక్ష్యమని ఆయన తెలిపారు.

పోరాటం ఆపేది లేదు

న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 07: దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడే వరకు తమ పోరాటం ఆగదని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ఇండియా కూటమి ముఖ్య నాయకులను ఢిల్లీ పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బారాఖంబ పోలీస్ స్టేషన్‌లో ఉన్న రాహుల్ గాంధీని కలిసేందుకు వెళ్లిన తనను కూడా పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని ఆరోపించారు. ఓటు హక్కును హరిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తే దేశ ప్రజలు బీజేపీని ఏమాత్రం క్షమించరని ఘాటుగా హెచ్చరించారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ పార్టీకి సంబంధించినది కాదని, యావత్ దేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసమని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. అక్రమ నిర్బంధాలు, పోలీసుల దౌర్జన్యాలతో కాంగ్రెస్ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీయలేరని, లాఠీలు, అరెస్టులతో పోరాటాలను ఆపడం ఎవరి వల్లా కాదని స్పష్టం చేశారు.ఓట్ల తొలగింపు వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం తీరు అత్యంత వివాదాస్పదంగా మారిందని, నిష్పక్షపాతంగా వ్యవహరించడంలో విఫలమైన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర పాలకుల్లో పెరిగిపోతున్న అసహనానికి ఈ అక్రమ అరెస్టులే నిదర్శనమని, ప్రజల హక్కులను కాపాడే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు రాహుల్‌గాంధీకి మద్దతుగా దీక్ష చేపడతానన్న కాంగ్రెస్ పార్టీ నేత జగ్గారెడ్డి తెలిపారు. బీజేపీ, ఈసీకి వ్యతిరేకంగా రాహుల్ పోరాటం చేస్తున్నారన్న జగ్గారెడ్డి రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాహుల్ ఎన్ని రోజులు పోరాటం చేస్తే అన్ని రోజులు దీక్ష చేపడతాని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

ఢిల్లీలో భవనం కూలి విషాదం

- ముగ్గురు మృతి..

8 మందికి గాయాలు

న్యూఢిల్లీ, మన జనప్రగతి అక్టోబర్ 07: దేశ రాజధాని ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో బుధవారం భారీ భవనం కూలిన ఘటన విషాదం నింపింది. బహుళ అంతస్తుల భవనం కుప్పకూలడంతో ముగ్గురు మృతి చెందగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. మృతుల్లో ఒక చిన్నారి ఉన్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.సీమాపురిలోని మత్స్య మార్కెట్ సమీపంలో మధ్యాహ్నం సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఢిల్లీ అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, పౌర రక్షణ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాలను తొలగిస్తూ మరికొందరు లోపల చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు కొనసాగించారు.ప్రమాదం కారణంగా సీమాపురి గోల్‌చక్కర్, డీఎల్‌ఎఫ్ భోపురా, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సహాయక, అంబులెన్స్ వాహనాలు వేగంగా ఘటనాస్థలికి చేరుకునేందుకు మార్గాలను ఖాళీగా ఉంచాలని పోలీసులు ప్రజలకు సూచించారు. భవనం కూలడానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.కాగా, ఘటనలో గాయపడిన వారిలో చిన్నారులు కూడా ఉన్నట్లు సమాచారం. శిథిలాల తొలగింపు, గాలింపు చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతులు, క్షతగాత్రుల సంఖ్యపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఎమ్మెల్సీ అనంతబాబుకు సుప్రీంకోర్టులో చుక్కెదురు



రాజమండ్రి, మన జనప్రగతి అక్టోబర్ 07: వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. విచారణ తుది దశకు చేరుకున్న సమయంలో నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించడం సరైన పద్ధతి కాదని, ముందుగా హైకోర్టుకు వెళ్లాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. కేసు విచారణ అత్యంత వేగంగా సాగుతోందని, మొత్తం 87 మంది సాక్షుల్లో అత్యధికుల విచారణ ఇప్పటికే పూర్తయిందని ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా తెలిపారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేయడం సముచితం కాదని ఆయన తన వాదనలు వినిపించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, కేసులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. విచారణ గడువును మరో ఆరు నెలలు పొడిగించాలని అనంతబాబు భార్య చేసిన అభ్యర్థనను కూడా కోర్టు తోసిపుచ్చింది. ఈ సందర్భంగా పిటిషన్‌ను వెనక్కి తీసుకుని హైకోర్టును ఆశ్రయించాలని అనంతబాబు తరఫు న్యాయవాదులకు ధర్మాసనం సూచించింది. విచారణను రోజువారీ పద్ధతిలో కొనసాగించి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో, వీడియో ఫైల్స్, డిజిటల్ ఆధారాలకు సంబంధించిన మరో అనుబంధ పిటిషన్‌ను కూడా పిటిషనర్ తరఫు వారు ఉపసంహరించుకున్నారు. గతంలో బెయిల్‌పై విడుదలైన అనంతబాబుకు... సాక్షులను బెదిరించారన్న ఆరోపణలతో బెయిల్ రద్దు కావడంతో ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారు.

రెపో రేటు 5.50 శాతానికి పెంపు

(మొదటి పేజీ తరువాయి)

రుణాలపై వడ్డీ భారం మరింత పెరిగితే మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు తీసుకున్నవారికి నెలవారీ ఈఎంఐలు పెరిగే ప్రమాదం ఉంది.ద్రవ్యోల్బణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భారతీయ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకోనుంది. ద్రవ్యోల్బ ణాన్ని అదుపులో ఉంచేందుకు వడ్డీ రేట్లను పెంచితే బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే ఖర్చు పెరుగుతుంది. ఇప్పటికే రుణాలు కొనసాగుతున్న వారికి కూడా వడ్డీ రేట్ల మార్పుల ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో కుటుంబ ఆదాయంలో ఎక్కువ భాగం రుణ చెల్లింపులకే వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు.గృహ రుణాలు తీసుకున్న వారిపై ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వడ్డీ రేట్లు పెరిగితే బ్యాంకులు ఈఎంఐలను పెంచడం లేదా రుణ కాలపరిమితిని పొడిగించడం వంటి చర్యలు చేపట్టవచ్చు. ఈఎంఐ పెరిగితే నెలవారీ ఖర్చులు పెరుగుతాయి. కాలపరిమితి పెరిగితే మొత్తం రుణంపై చెల్లించాల్సిన వడ్డీ మరింత పెరిగే అవకాశం ఉంటుంది.వ్యాపార రంగం పైనా అధిక వడ్డీ రేట్ల ప్రభావం పడుతుంది. పరిశ్రమలు, చిన్న వ్యాపార సంస్థలు పెట్టుబడులు, విస్తరణ కోసం బ్యాంకు రుణాలపై ఆధారపడుతుంటాయి. రుణ వ్యయం పెరిగితే కొత్త పెట్టుబడులపై నిర్ణయాలను వాయిదా వేసే పరిస్థితి ఏర్పడవచ్చు. చిన్న, మధ్య తరహా సంస్థలకు ఇది మరింత భారంగా మారే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.మరోవైపు ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తే వడ్డీ రేట్లపై ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది. ఆహార ధరలు, ముడిచమురు ధరలు, వర్షపాతం, దేశీయ ఆర్థిక పరిస్థితులతో పాటు అంతర్జాతీయ పరిణామాలను రిజర్వ్ బ్యాంక్ పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకోనుంది. వడ్డీ రేట్ల విషయంలో ఆర్‌బీఐ తీసుకునే నిర్ణయం రుణగ్రహీతలు, బ్యాంకులు, వ్యాపార రంగంపై గణనీయమైన ప్రభావం చూపనుంది.ఇప్పటికే రుణాలు ఉన్నవారు తమ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఖర్చులను నియంత్రించుకోవడంతో పాటు రుణ చెల్లింపులపై ముందస్తు ప్రణాళిక చేసుకోవాల్సిన అవసరం ఉంది. వడ్డీ రేట్ల మార్పులు కొనసాగుతున్న నేపథ్యంలో కొత్తగా రుణాలు తీసుకునే వారు కూడా ఈఎంఐ, వడ్డీ భారం, రుణ కాలపరిమితిని సమగ్రంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

ఢిల్లీలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ప్రధాని మోదీకి, హోంమంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేయనున్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్రం నుంచి అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని, రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును వేగవంతం చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిపే చర్చల్లో ముఖ్యమంత్రి ప్రస్తావించనున్నారు. గోదావరి నుంచి వృథాగా సముద్రంలోకి వెళుతున్న మిగులు జలాల సద్వినియోగం, నదుల అనుసంధానం ప్రాజెక్టుపై సమగ్ర అధ్యయనం చేయించడం వంటి అంశాలను కేంద్ర జలవనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నారు. పర్యటనలో భాగంగా రేపు మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించే 'భాగస్వామ్య సదస్సు' కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి చంద్రబాబు పాల్గొంటారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం రేపు రాత్రికి ఆయన ఢిల్లీ నుంచి తిరిగి అమరావతికి బయలుదేరనున్నారు.

నాపై దేశ ప్రజలకే ఎక్కువ హక్కు ఉంది

(మొదటి పేజీ తరువాయి)

నా గొప్ప ఆస్తి. ఈ ఆస్తి మోదీకి కాదు, దేశానికి చెందుతుంది. మాతృభూమిలోని ప్రతి బిడ్డకు దానిపై హక్కు ఉంది" అని అన్నారు.బాధ్యతలను ఒక లక్ష్యంగా మార్చుకున్నామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. కార్యాచరణే తన మతమని, భగవద్గీత బోధించిన 'కర్మణ్యే వాధికారస్తే' మార్గంలోనే నడుస్తున్నానని చెప్పారు. తాను ఎప్పుడూ కీర్తి ప్రతిష్టల గురించి పట్టించుకోలేదని, కేవలం దేశం కోసం పని చేయడమే తన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పాతికేళ్ల పాటు ప్రభుత్వం అధినేతగా కొనసాగుతానని తాను అసలు ఊహించలేదని, తన కెరీర్ ఇలా సాగుతుందని అసలు ఊహించలేదు అన్నారు. "దేశం నాకు చాలా ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత అందరికంటే ఎక్కువగా ఉంటుంది. భారత్‌లోని ప్రతి పౌరుడికీ నాపై అత్యంత హక్కు ఉందని నేను హృదయపూర్వకంగా నమ్ముతున్నాను" అన్నారు. ప్రధానమంత్రి మాట్లాడుతూ, "నేను దేశప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 7 అక్టోబర్ 2001న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ ఘట్టం వస్తుందని అనుకోలేదు. ఈరోజు ప్రభుత్వ అధినేతగా నిరంతరం సేవ చేస్తూ నేను 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాను. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదాల ఫలితం. బీజేపీ, ఎన్డీఏ, ప్రజాస్వామ్యం పట్ల గౌరవం ఉన్న రాజకీయ సహచరులందరికీ నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నేను దేశ ప్రజల పాదాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను" అన్నారు.

మోదీ పాలనా ప్రస్థానానికి 25 ఏళ్లు

(మొదటి పేజీ తరువాయి)

దేశాభివృద్ధిపై నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై మరింత ఆత్మవిశ్వాసంతో, గౌరవప్రదంగా ఎదుగుతోందని లోకేశ్ అన్నారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధన దిశగా మోదీ ఆలోచనా విధానం, నిర్ణయాలను అమలు చేసే తీరు ప్రజాజీవితంలో ఉన్నవారికి స్ఫూర్తినిస్తోందని పేర్కొన్నారు.పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవడంతో పాటు చిన్న విషయాలపై కూడా దృష్టి సారించి, భారీ స్థాయిలో కార్యక్రమాలను అమలు చేయగల సామర్థ్యం మోదీకి ఉందని లోకేశ్ ప్రశంసించారు. ప్రధానమంత్రి మరిన్ని సంవత్సరాలు దేశానికి సేవలందించాలని ఆకాంక్షించారు.మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో లోకేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

టెన్షన్.. టెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

తీసుకునే క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. పలువురు ఎంపీలు, కార్యకర్తలను అరెస్టు చేసి వేర్వేరు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ ఘటనల్లో పలువురికి గాయాలు కాగా, కొందరి దుస్తులు చిరిగిపోయాయి. అరెస్టయిన ఎంపీలు పోలీస్‌స్టేషన్లలోనూ తమ నిరసన కొనసాగించారు.బారాఖంబా పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి సతీశన్‌లను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కాంగ్రెస్ నేతలు భారీగా చేరుకుని ఆందోళన చేపట్టారు. సుమారు రెండు గంటల అనంతరం రాహుల్‌గాంధీతో పాటు ఇండియా బ్లాక్ ఎంపీలను పోలీసులు విడుదల చేశారు.నిరసనల నేపథ్యంలో ఢిల్లీలోని కీలక ప్రాంతాల్లో భారీగా భద్రతా బలగాలను మోహరించారు. జంతర్‌మంతర్ పరిసరాల్లో ఆంక్షలు విధించడంతో పాటు పలు ప్రధాన మార్గాలను మూసివేశారు. దీంతో నగరంలో ట్రాఫిక్ తీవ్రంగా ప్రభావితమైంది. ఢిల్లీ పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్, ఆర్ఎఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ బలగాలను మోహరించారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌ను ప్రతిపక్ష నేతలు పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ ఆందోళన కొనసాగుతుందని కాంగ్రెస్, ఇతర ఇండియా బ్లాక్ నేతలు స్పష్టం చేశారు.

అకాడమిక్ ఇన్స్ట్రక్టర్స్ నియామకంతో విద్యార్థుల బోధనకు ఉపయోగం అవుతుంది



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 07:-రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయ ఖాళీల్లో భాగంగా అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ను నియామకం చేయడంతో విద్యార్థుల విద్యా బోధనకు ఎంతో దోహదపడుతుందని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గుడిపల్లి సురేందర్ అన్నారు.బుధవారం స్థానిక బి. క్యాంపు ప్రభుత్వ పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో పాఠశాలకు గణిత ఉపాధ్యాయ ఖాళీలో భాగంగా నియమించిన గణిత అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ నియామకంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నియామకం చేసేందుకు కృషిచేసిన గుడిపల్లి సురేందర్ ను ప్రధాన ఉపాధ్యాయులు జి శంకర్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ రబ్బాని ఉపాధ్యాయులు కలిసి శాలువ కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గుడిపల్లి సురేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు సరైన విద్యా బోధనకై మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కిరణ్ జోషి, వాలేటి విజయకుమార్, హరి శంకర్ ,ఫిజికల్ డైరెక్టర్లు విజయ్ కుమార్ ,జగన్మోహన్ ఆచారి విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా ఉత్సవాలు



దేవనకొండ మన జనప్రగతి అక్టోబర్ 7:-ఆస్పరి ప్రాజెక్టు పరిధిలోని దేవనకొండ మండలం సెక్టార్ గద్దెరాళ్ల అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం, అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బాలామృతం అందించడం, బరువు పరిశీలన, పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలపై తల్లులకు అవగాహన కల్పించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను వివరించారు. చిన్నారుల ఎదుగుదల పర్యవేక్షణ, పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణ, తల్లిబిడ్డల సంక్షేమం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సరోజ, రాజేశ్వరి, పిల్లల తల్లులు, మదర్స్ మీటింగ్ సభ్యులు పాల్గొన్నారు.

పత్తికొండను కరువు మండలంగా ప్రకటించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

- నలకదొడ్డి టీడీపీ గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్



పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 07:-పత్తికొండ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కేఈ. శ్యాంబాబుకు నలకదొడ్డి టీడీపీ గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్, రైతులు బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో పత్తికొండ ప్రాంతంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడం రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని వారు అన్నారు. కరువు పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతు ల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కేఈ. శ్యాంబాబు చేసిన కృషి అభినందనీయమన్నారు. కరువు మండలంగా ప్రకటించడంతో రైతులకు ప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారం, కరువు సహా యక చర్యలు అందే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల పక్షాన నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కేఈ. శ్యాంబాబుకు మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ పిలుపు



పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 07:-రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం పత్తికొండలోని వైఎస్సార్సీపీ క్యాంపు కార్యాలయంలో మాజీ ఎంపీపీ నాగరత్నమ్మతో కలిసి వైఎస్సార్సీపీ క్రియాశీలక కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కంగాటి శ్రీదేవమ్మ మాట్లాడుతూ పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఉన్న కార్యకర్త ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ. 5 లక్షల ప్రమాద బీమా అందేలా పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ, పట్టణ మాజీ వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

22-ఏ పెండింగ్ దరఖాస్తులకు తక్షణ పరిష్కారం

15 రోజులు దాటిన దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలి
రీ-సర్వే, హౌస్సైట్స్ పెండింగ్ పనులపైనా ప్రత్యేక దృష్టి





కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 07:-22-ఏకు సంబంధించి 15 రోజులకు మించి పెండింగ్లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆర్డీవోలు, తహశీల్దార్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు, తహశీల్దార్లతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 22-ఏ భూములకు సంబంధించిన పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించి, ఆన్లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. 22-ఏ ప్రొసీడింగ్స్ జారీ చేసిన కేసుల్లో మ్యుటేషన్ ప్రక్రియ పూర్తయిందా లేదా అనే విషయాన్ని కేసుల వారీగా పరిశీలించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.రీ-సర్వే ఫేజ్4లో తహశీల్దార్ల లాగిన్లో, ఫేజ్5లో వీఆర్వోల లాగిన్లో పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఫేజ్6లో 44 గ్రామాల్లో జరుగుతున్న గ్రౌండ్ ట్రూథింగ్ పనులను డిసెంబర్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. హౌస్సైట్స్కు సంబంధించి పెండింగ్లో ఉన్న దరఖాస్తులను కూడా వేగంగా పరిష్కరించాలని సూచించారు. అలాగే ఈ-ఆఫీస్లో పెండింగ్లో ఉన్న ప్రక్రియను శుక్రవారం లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ 22-ఏ కేసుల పరిష్కారంలో పారదర్శకత, బాధ్యతాయుత నిర్ణయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి కేసును ఈ-ఆఫీస్లో ప్రాసెస్ చేసి, అప్రూవ్ లేదా రిజెక్ట్ చేసే ముందు సంబంధిత పిటిషనర్తో తప్పనిసరిగా మాట్లాడాలని ఆదేశించారు. నిర్ణయానికి గల కారణాలను పిటిషనర్కు స్పష్టంగా తెలియజేయాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు, ఇబ్బందులు లేకుండా రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సమావేశంలో డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, ఆర్డీవోలు ఓబులేసు, అరుణదేవి, సందీప్ కుమార్, సర్వే ఏడీ మురళి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సునీత, అనురాధ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రియంవద, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లి,బిడ్డల ఆరోగ్యానికి పోషకాహారం కీలకం

పోషకాహారం,టీకాలు,పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
పోషణ మాసం కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి





కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 07:-తల్లి, బిడ్డల ఆరోగ్య పరిరక్షణకు పోషకాహారం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. గర్భధారణ దశ నుంచే తల్లులు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శిశువు జన్మించిన అనంతరం ఆహారం, టీకాలు, శారీరక, మానసిక ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన పోషణ మాసం2026 జిల్లా స్థాయి కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ గ్రోత్ మానిటరింగ్, మాతృ వందన యోజన, అంగన్వాడీ కమిటీ, మిలెట్స్, గర్భిణులు, బాలింతల ఆహారం, మునగాకు కార్నర్ తదితర స్టాళ్లను పరిశీలించారు. పోషకాహార ప్రాధాన్యతను వివరించేలా ఏర్పాటు చేసిన ప్రదర్శనలను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.కలెక్టర్ మాట్లాడుతూ గర్భధారణ సమయంలో తీసుకునే పోషకాహారం తల్లి, శిశువు ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, టేక్హోమ్ రేషన్ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్నంతో పాటు గుడ్లు, పాలు, పప్పులు, శనగలు, చికెన్, చేపలు వంటి ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు.ఆరు నెలల తర్వాత పిల్లలకు తల్లిపాలతో పాటు వయస్సుకు అనుగుణంగా అదనపు ఆహారం అందించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన వేడి ఆహారం అందేలా పర్యవేక్షించాలని, ఎదుగుదల లోపాలు, ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి వైద్యులకు రిఫర్ చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి గర్భిణి, బాలింతకు ప్రధానమంత్రి మాతృ వందన యోజన ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో పిల్లల్లో వయసుకు, ఎత్తుకు తగ్గ బరువు లేని కేసులను గుర్తించి ప్రత్యేకంగా పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. అంగన్వాడీ, ఆర్బీఎస్కే బృందాల ద్వారా నిర్వహించే ఆరోగ్య పరీక్షలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఆరోగ్యకరమైన బాలలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొన్నారు.అనంతరం జిల్లాలోని 9 ప్రాజెక్టుల పరిధిలో పోషణ్ ఛాంపియన్లుగా ఎంపికైన తొమ్మిది మంది తల్లులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి విజయ, డీఎంహెచ్ఓ డాక్టర్ కామేశ్వర ప్రసాద్, డీసీహెచ్ జఫ్రుల్లా, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్సీపీ జెండా ఎగురవేయాలి

- గ్రూపు తగాదాలకు దూరంగా ఐక్యంగా పనిచేయాలి:మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ
- పెరవలిలో కార్యకర్తలకు గుర్తింపు కార్డుల పంపిణీ



పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 07:-రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలంతా కలిసి కట్టుగా పనిచేసి పెరవలి గ్రామంలో మరోసారి వైఎస్సార్సీపీ జెండా ఎగురవేయాలని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ పిలుపునిచ్చారు. మద్దికేర మండలం పెరవలి గ్రామంలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరయ్యారు.ఈ సందర్భంగా శ్రీదేవమ్మ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు గ్రూపు తగాదాలకు దూరంగా ఉండి ఐక్యంగా పనిచేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు.అనంతరం వైఎస్సార్సీపీ క్రియాశీలక కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. పార్టీ సభ్యత్వం ఉన్న కార్యకర్త ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుం బానికి రూ. 5 లక్షల ప్రమాద బీమా అందేలా పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.అనంతరం వైఎస్సార్సీపీ కార్యకర్త పెరవలి మస్తాన్బీ కుమారుడి నూతన గృహప్రవేశ ఆహ్వాన కార్యక్రమంలో పాల్గొన్నారు. దస్తగిరి ఆహ్వానం మేరకు ఆయన స్వగృహానికి వెళ్లారు. రోడ్డు ప్రమాదంలో గాయప డిన మాజీ వార్డు సభ్యుడు రంగస్వామిని ఇంటికి వెళ్లి పరామర్శించారు.కార్యక్రమంలో పెరవలి గ్రామ వైఎస్సార్సీపీ నాయకులు, మండల కన్వీనర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు, మేధావులు, రైతు విభాగాల తాలూకా అధ్యక్షులు, జిల్లా కమిటీ నాయకులు, మద్దికేర మండల నాయకులు, మాజీ ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీ, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ పాఠశాల రోడ్డుకు సీసీ రోడ్డు మంజూరు

- టీడీపీ, జనసేన ఇన్చార్జులకు విద్యార్థినుల కృతజ్ఞతలు

దేవనకొండ మన జనప్రగతి అక్టోబర్ 07:-కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు కావడంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు మంజూరుకు కృషి చేసిన ఆలూరు టీడీపీ ఇన్చార్జి వైకుంఠం జ్యోతి, జనసేన ఇన్చార్జి తెర్నేకల్ వెంకప్పలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గత కొన్నేళ్లుగా పాఠశాలకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్డంతా గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేదని, గుంతల కారణంగా విద్యార్థినులు, తల్లిదండ్రులు పలుమార్లు కిందపడిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు.ఈ సమస్యను టీడీపీ, జనసేన ఇన్చార్జుల దృష్టికి తీసుకెళ్లగా వారు అధికారులతో మాట్లాడి ప్రత్యేక చొరవ చూపారని విద్యార్థినులు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణానికి అనుమతులు రావడంతో ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం లభించనుందని, కూటమి నాయకుల కృషి అభినందనీయమని విద్యార్థినులు, తల్లిదండ్రులు పేర్కొన్నారు.

నూతన మద్యం దుకాణాలకు 14 దరఖాస్తులు

- నేడు లక్కీ డ్రా ద్వారా ఎంపిక



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబరు 07:-అట్లూరు,ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల్లో నూతన మద్యం దుకాణాల ఏర్పాటుకు 14 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా అందినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం సిద్ధవటంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భాకరాపేటకు ఒకటి, మాధవరానికి రెండు, మాచుపల్లికి ఒకటి, కొత్త మాధవ రానికి ఒక దరఖాస్తు వచ్చినట్లు వివరించారు. మిగిలిన దరఖా స్తులు ఆయా మండలాల్లోని దుకాణాలకు సంబంధించినవని తెలిపారు. నూతన మద్యం దుకాణాలకు దరఖాస్తుదారుల ఎంపికను గురువారం జిల్లా కలెక్టరేట్‌లో లక్కీ డ్రా ద్వారా నిర్వహించనున్నట్లు సీఐ రాజశేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోశాల అభివృద్ధికి సహకరించాలి

- ట్రస్ట్ అధినేత వెంకట నరసింహస్వామి




సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 07:-గోశాల అభివృద్ధికి దాతలు,ప్రజలు తమవంతు సహకారం అందించాలని పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి గోశాల ట్రస్ట్ అధినేత వెంకట నరసింహస్వామి కోరారు.మండలంలోని మొహిద్దిన్ సాహెబ్ పల్లె సమీపంలోని గోశాల వద్ద బుధవారం ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో గోమాతలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఆవులమర్రి గుట్ట కింద నుంచి గోశాల వరకు పైప్‌లైన్ ఏర్పాటు పనులు చేపట్టినట్లు తెలిపారు. సుమారు రూ.5 లక్షల వ్యయంతో ఈ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. గోశాల అభివృద్ధి, గోమాతల సంరక్షణకు మరింత సహకారం అవసరమని,దాతలు ముందుకు వచ్చి తమ వంతు చేయూత అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధినేత వెంకట నరసింహస్వామి, హరికృష్ణ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో జాతీయ స్థాయి సాంకేతిక వర్క్‌షాప్ 'ఫేజర్ 2కే26'



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 07: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగం ఆధ్వర్యంలో 'ఫేజర్ 2కే26' పేరిట నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది. ప్రస్తుత సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,ఎంబెడెడ్ సిస్టమ్స్ ఫర్ డ్రోన్ స్వార్మ్ టెక్నాలజీ అనే అత్యాధునిక అంశంపై ఈ సదస్సును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా, పారిశ్రామిక నిపుణుడిగా ఆమ్‌గ్రో ఆగ్రిటెక్ మేనేజింగ్ డైరెక్టర్ పి.వెంకట సందీప్ హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.డ్రోన్ల రూపకల్పన,వాటి పనితీరులో కీలకమైన సెన్సార్లు,ఫ్లైట్ కంట్రోలర్లు, ఎలక్ట్రానిక్ స్పీడ్ కంట్రోలర్లు, మోటార్లు మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనుసంధానంపై ఆయన విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. భవిష్యత్తులో డ్రోన్ టెక్నాలజీ, ఎంబెడెడ్ సిస్టమ్స్ రంగాల్లో ఇంజనీరింగ్ విద్యార్థులకు అపారమైన ఉద్యోగ,పరిశోధన అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ వర్క్‌షాప్‌కు వివిధ ప్రాంతాల ఇంజనీరింగ్ కళాశాలల నుంచి దాదాపు 150 మందికి పైగా విద్యార్థులు హాజరై ప్రాక్టికల్ అంశాలపై పాలుపంచుకున్నారు.కార్యక్రమంలో ఈఈఈ విభాగాధిపతి మరియు కన్వీనర్ డాక్టర్ జె.శ్రీనివాసులు,కో-ఆర్డినేటర్లు డాక్టర్ ఆర్.నరేంద్ర,టి.ఓబులేసుతో పాటు కళాశాల అధ్యాపక బృందం,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓట్ బచావోదేశ్ బచావో ఉద్యమానికి కార్యాచరణ



పోరుమామిళ్ల మన జనప్రగతి అక్టోబర్ 07:-ఏఐసీసీ పిలుపు మేరకు 'ఓట్ బచావోదేశ్ బచావో' ప్రజా ఉద్యమాన్ని నిర్వహించేందుకు కాంగ్రెస్, వామపక్ష పార్టీల నాయకులు పోరుమామిళ్లలో కార్యాచరణ రూపొందించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పీసీసీ సభ్యుడు, పోరుమామిళ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ ఆధ్వర్యంలో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నేతలతో చర్చించారు.ఈ సందర్భంగా డాక్టర్ అన్వర్ మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలను ప్రజలకు వివరించేందుకు గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని విస్తరిస్తామని తెలిపారు. ఓటర్ల హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఇండియా కూటమి పార్టీలతో కలిసి ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు.సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ మాట్లాడుతూ ఓట్ల అక్రమాలపై తమ పార్టీ నిరసన కొనసాగిస్తుందని తెలిపారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలతో కలిసి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్, వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలకు పులివెందుల క్రీడాకారులు ఎంపిక

- కడప వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ
- అండర్-17, అండర్-14 విభాగాల్లో స్థానం దక్కించుకున్న బాలబాలికలు
- హర్షం వ్యక్తం చేసిన డీడీఎస్వో గౌస్ బాషా



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 07:రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) హాకీ పోటీలకు పులివెందులకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 3న కడపలోని వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ వేదికగా నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14,అండర్-17 బాలబాలికల హాకీ ఎంపిక పోటీల్లో వీరు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఖేలో ఇండియా హాకీ కోచ్ ఈ.రవికుమార్ తెలిపారు.అండర్-17 బాలుర విభాగం లో సి.జగన్మోహన్,ప్రణీత్,అండర్-17 బాలికల విభాగం లో డి.తరుణ్య,కుందన శ్రీ,ఆర్.గంగాకార్తిక, అండర్-14 బాలుర విభాగం లో పి.హేమంత్,షేక్.మొహమ్మద్ ఇలియాజ్,గాడిగ హనీశ్రుత్అండర్-14 బాలికల విభాగం లో ఆర్.రాధాదేవి,బి.రేణుక సంకీర్తన,జి.చైత్రిక ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు.ఈ సందర్భంగా జిల్లా డెవలప్‌మెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ (డీడీఎస్వో) గౌస్ బాషా మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు,పులివెందులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు తపస్య జూనియర్ కళాశాల విద్యార్థి ఎంపిక



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 07:తపస్య జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి సన్నీ బాబు రాష్ట్రస్థాయి సీనియర్స్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. సెప్టెంబర్ 19న కడప జిల్లా ప్రొద్దుటూరులో నిర్వహించిన ఎంపిక పోటీల్లో సన్నీ బాబు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ ఘనత సాధించాడు.ఈ నెల 11, 12 తేదీల్లో గుంటూరులో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సీనియర్స్ షూటింగ్ బాల్ పోటీల్లో ఇతడు ప్రాతినిధ్యం వహించనున్నాడు.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ చంద్రప్రసాద్ రెడ్డి,ప్రిన్సిపల్ రవిశంకర్ రెడ్డి విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.కరస్పాండెంట్,ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడారంగంలోనూ విశేషంగా రాణిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.రాబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో సన్నీ బాబు ఉత్తమ ప్రదర్శన కనబరిచి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

డాక్టర్ బాదం బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం



కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 07:-సమాజ సేవలో భాగంగా డాక్టర్ బాదం బాలకృష్ణ జన్మదిన వారోత్సవాలను పురస్కరించుకుని కాకినాడ ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న పైడా డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ కాకినాడ గోల్డెన్ జూబ్లీ, లయన్స్ క్లబ్ సఖీ, లయన్స్ క్లబ్ 'మనం' సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.డిస్ట్రిక్ట్ బ్లడ్ క్యాంప్స్ ప్రాజెక్టు చైర్మన్ నిమ్మకాయల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్ బ్లడ్ క్యాంప్స్ ప్రాజెక్టు చైర్మన్ మేడిశెట్టి వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వారం రోజుల పాటు మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించి 600 యూనిట్ల రక్తాన్ని సేకరించాలనే లక్ష్యంతో పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమంగా జరుపుకోవడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు.ఈ శిబిరంలో పైడా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ వైద్య బృందం విద్యార్థుల నుంచి 52 యూనిట్ల రక్తాన్ని సేకరించింది. ఈ సందర్భంగా శిబిరానికి సహకరించిన కళాశాల వ్యవస్థాపకులు పైడా జగన్నాథ సత్యప్రసాద్‌తో పాటు రెడ్‌క్రాస్ వైద్య సిబ్బందికి ప్రాజెక్ట్ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ దొడ్డి రామసుబ్రహ్మణ్యం, లయన్స్ నాయకులు ఆర్.వి.రమణమూర్తి, దంగేటి సతీష్, నూలు నాగలక్ష్మి, వెంకటేశ్వరి, డాక్టర్ మధురవాణి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో బసవతారకం ఉచిత మెడికల్ క్యాంప్

- పరిశీలించిన మాజీ జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి



సింహాద్రిపురం మన జనప్రగతి అక్టోబర్ 07: సింహాద్రిపురం మండల కేంద్రంలో నిర్వహించిన బసవతారకం క్యాన్సర్ స్క్రీనింగ్ మరియు ఉచిత మెడికల్ క్యాంప్ ముగింపు కార్యక్రమాన్ని పులివెందుల మాజీ జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి సందర్శించారు. పుష్పాల శ్రీధర్ రెడ్డితో కలిసి క్యాంప్‌ను పరిశీలించిన లతా రెడ్డి స్థానిక ప్రజలకు అందుతున్న వైద్య పరీక్షలు, సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యాధునిక క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బసవతారకం ఆసుపత్రి క్యాంప్ మేనేజర్ లక్ష్మణ్,డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సులోచన రాణి,గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రవణ కుమారి,డాక్టర్ నవీన్,డాక్టర్ ప్రశాంత్‌తో పాటు వైద్య సిబ్బంది,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

2029లో పార్టీ అధికారంలోకి వస్తే కార్యకర్తలకే ప్రాధాన్యం

- వైకాపా మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, మాజీ జడ్పీటీసీ కోకటం వెంకట బయపురెడ్డి
- స్థానిక ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు
- మూడు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఐడీ కార్డుల పంపిణీ



వేముల మన జనప్రగతి అక్టోబర్ 07:రాబోయే 2029 శాసనసభ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కార్యకర్తలకు ప్రాధాన్యం ఉంటుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సందర్భాల్లో చెప్పిన విషయాన్ని ప్రతి కార్యకర్త గుర్తుంచుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, మాజీ జడ్పీటీసీ కోకటం వెంకట బయపురెడ్డి లు పేర్కొన్నారు.బుధవారం సాయంత్రం వేముల మండలంలోనీ నల్లచెరువుపల్లి, కొండ్రెడ్డిపల్లి, నారేపల్లి గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు వారు పార్టీ ఐడీ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..201924 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వాలంటీర్ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో సంక్షేమ పథకాలు అందించడంతో పార్టీ కార్యకర్తలకు కొంత మేర గుర్తింపు తగ్గిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయినప్పటికీ కార్యకర్తలు పార్టీకి అండగా నిలిచారని పేర్కొన్నారు.ప్రతి గ్రామంలో ఉన్న కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మండల స్థాయి నాయకుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా ఏకమై, సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.పార్టీ కార్యకర్తలకు గుర్తింపు కల్పించేందుకు ఐడీ కార్డులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఐడీ కార్డుతో పాటు రూ.5 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పించడం ద్వారా కార్యకర్తలకు, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ వర్ర నారాయణరెడ్డి, వర్ర లక్ష్మిరెడ్డి, యువ నాయకులు రామిరెడ్డి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా విభజన విభాగం కార్యనిర్వాహక సభ్యులు చల్లా సునీల్ కుమార్,సీనియర్ నాయకులు చిన్న జనార్ధన్‌రెడ్డి, రాజారెడ్డి,గంగిరెడ్డి,గంగులయ్య,వెంకటేశు తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్.ఎం.డబ్ల్యూ.ఎస్.ఎస్.బి అధికారులతో సమీక్ష సమావేశం

- కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ నాయకులు



శేరిలింగంపల్లి మన జనప్రగతి అక్టోబరు 07:-మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సమావేశంలో హెచ్ ఎన్ డబ్ల్యు ఎస్ ఎస్ బి జీఎం కృష్ణ , శేరిలింగంపల్లి నియోజకవర్గ డీజీఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని మంచినీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలు, పెండింగ్ లో ఉన్న మంచినీటి పైప్ లైన్ పనులపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. అవసరమైన ప్రాంతాలలో బూస్టర్లను ఏర్పాటు చేయాలని, అసంపూర్తిగా ఉన్న యూజీడీ పనులు మరియు చేపట్టవలసిన పనులపై ఆరా తీశారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి ఉమ్మడి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో మంచినీటి సరఫరాలో అంతరాయం, తక్కువ ప్రెజర్ తో నీరు రావడం వంటి సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి, హెచ్ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రాజీవ్ గృహకల్ప, పాపిరెడ్డి కాలనీ, గోపి నగర్, నెహ్రూనగర్, తారానగర్ మరియు పలు ప్రాంతాల్లో యూజీడీ మరియు మంచినీటి కొత్త లైన్ వేయాలని, పెండింగ్ మ్యాన్ హోల్స్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ , హెచ్ఎమ్ డబ్ల్యూ ఎస్ ఎస్ బి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తూ, ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా, డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు పురం విష్ణువర్ధన్ రెడ్డి మరియు తదితర ముఖ్య నాయకులు, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ నిబంధనలు మేరకే ఏపీఎం విధులు నిర్వహణ

● గ్రూపులు క్రమబద్ధీకరణ పట్ల విఓఎల హర్షం



కాకినాడ/గోధూళి మన జనప్రగతి అక్టోబర్ 07:-సెర్ప్ సంస్థ నిబంధనలు మేరకే ఏపీఎం విధులు నిర్వహిస్తున్నారని అందులో భాగంగానే డ్వాక్రా సంఘాల గ్రూపులను క్రమబద్ధీకరిస్తున్నట్లు పలువురు విఓఎలు తెలిపారు. అందరూ విఓఎలకు న్యాయం జరిగేందుకు ఏపీఎం సత్యనారాయణ సెర్ప్ నిబంధనలను అమలు చేయడం పట్ల వివోఏలు హర్షం వ్యక్తం చేశారు.బుధవారం కాకినాడ రూరల్ విఓఎ (యానిమేటర్) అసోసియేషన్ (టీఎన్టీయుసి అనుబంధం) ఆధ్వర్యంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సబ్బతి ఫణీశ్వర రావు విఓఎలు కలిసి స్థానికంగా విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఫణీశ్వరరావు మాట్లాడుతూ తూరంగి గ్రామంలో ఒక విఓఎ ఆధ్వర్యంలో సుమారు 130 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయన్నారు. మరొక వివోఏ ఆధ్వర్యంలో 30 గ్రూపులు ఉండడంతో వారు ఎక్కువ పని చేసి తక్కువ ఫలితం పొందుతున్నారని చెప్పారు. అందరికీ సరాసరి విభజన పద్ధతిలో గ్రూపులను కేటాయించాలని తాము ఏపీఎం సత్యనారాయణకి తెలియజేశామన్నారు. ఆయన సెర్ప్ నిబంధనలను అనుసరిస్తూ ప్రతి ఒక్క గ్రూపులో 54 డ్వాక్రా సంఘాలకి తగ్గకుండా కేటాయిస్తూ న్యాయం చేశారని సబ్బతి చెప్పారు. ఏపీఎం సత్యనారాయణ, తమ అనుబంధ సంఘ విఓఎల పైన దుష్ప్రచారం చేయడం తగదన్నారు.యానిమేటర్లు నాగిడి పద్మావతి, సుభాషినిలు మాట్లాడుతూ తమపై, తమ వ్యక్తిత్వం పైన తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎపిఎం సత్యనారాయణ కాకినాడ రూరల్లో ఉన్న యానిమేటర్లు అందరికీ న్యాయం జరిగేలా నిబంధనలను అమలు చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు.ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షురాలు మల్లవరపు రమణమ్మ, కోశాధికారి పంపన రమాదేవి, కార్యదర్శి మట్టపర్తి సత్యవేణి, సంయుక్త కార్యదర్శి రేవు విజయ కుమారి, కోశాధికారి సుభాషిని తదితర యానిమేటర్లు పాల్గొన్నారు.

మోదీ ప్రజాసేవకు సంఘీభావంగా నమో సేవా సంకల్ప పాదయాత్ర



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 07:-భారత ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ ప్రస్థానాన్ని పురస్కరించుకొని కడప నుంచి ఒంటిమిట్ట దేవాలయం వరకు చేపట్టిన నమో సేవా సంకల్ప పాదయాత్ర బుధవారం సిద్ధవటం మండలంలోని సాయినగర్, ఉప్పరపల్లి గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ మహిళా నాయకురాలు కోటపాటి సుబ్బమ్మ పాదయాత్రలో పాల్గొన్న డీజేవైఎం రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి గుడిపాటి సుబ్బరాజు, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జునను శాలువాలతో సత్కరించి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. ఏపీ అభివృద్ధికి ప్రధాని మోదీ చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్డిపల్లి చెరువులో యథేచ్ఛగా మట్టి తరలింపు

- రాజకీయ అండదండలతోనే మట్టి మాఫియా రెచ్చిపోతోందని ఆరోపణలు





ఓబులవారిపల్లి మన జనప్రగతి అక్టోబర్ 07:-తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట, ఓబులవారిపల్లి మండలాల సరిహద్దులో ఉన్న రెడ్డిపల్లి చెరువులో యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత నెల రోజులుగా నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు, ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.ఈజీ మనీకి అలవాటుపడిన కొందరు ప్రభుత్వ వనరులను, ఖనిజ సంపదను కొల్ల గొడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. చెరువులోని విలువైన మట్టిని పొలాలకు, ఇటుక బట్టీలకు తరలిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మట్టి తరలింపు కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోందని పేర్కొంటున్నారు.చెరువులో ఎక్కడపడితే అక్కడ గుంతలు, లోతైన లోయలు ఏర్పడేలా మట్టిని తవ్వుతున్నారని, దీంతో వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఇరిగేషన్ అధికారులు నిర్దేశించిన ప్రాంతాల్లోనే మట్టి తవ్వకాలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, అందుకు విరుద్ధంగా మట్టి తరలింపు జరుగుతోందని ఆరోపిస్తున్నారు.మట్టి తరలింపునకు రాజకీయ అండదండలు ఉన్నాయనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

● నషా ముక్త్ భారత్ అభియాన్‌లో పోలీసుల ప్రతిజ్ఞ



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబరు 07:-భాకరపేటలోని 11వ బెటాలియన్ ఏపీఎస్పీలో బెటాలియన్ కమాండెంట్, ఎస్పీ (ఎన్‌సీ) కె. ఆనందరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో 'నషా ముక్త్ భారత్ అభియాన్‌అడిక్షన్ ఫ్రీ ప్లెడ్జ్ మెగా క్యాంపెయిన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కమాండెంట్ కె. ఆనందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బెటాలియన్ అధికారులు, సిబ్బంది, నూతనంగా నియమితులైన పోలీసు కానిస్టేబుళ్లతో వ్యసన రహిత భారతదేశ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాలు, మద్యం, పొగాకు తదితర వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో భాగంగా బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ధ్యాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు, మాదకద్రవ్యాల వ్యసనం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించే వీడియోను ప్రదర్శించారు. 'వ్యసనానికి నో చెప్పండిఆరోగ్యకరమైన జీవితానికి స్వాగతం పలకండి' అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్ కె. వెంకటప్ప, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఎస్‌సీటీపీసీలు, బెటాలియన్ సిబ్బంది, నూతనంగా నియమితులైన పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

దేవనకొండను కరువు మండలంగా ప్రకటించాలి

● రైతులను ఆదుకోవాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు



దేవనకొండ మన జనప్రగతి అక్టోబర్ 07:-దేవనకొండ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కరువు మండలాల ప్రకటనలో ప్రభుత్వం, అధికారులు పాటించిన శాస్త్రీయ ప్రామాణికాలను ప్రజలకు వివరించాలని కోరారు.కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బుధవారం దేవనకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. దేవనకొండ, కుంకనూరు, గుడిమరాళ్ల గ్రామాలకు చెందిన రైతులు దీక్షల్లో పాల్గొన్నారు. వేణు మహారాజ్ తదితరులు దీక్షలో కూర్చున్న వారికి పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, సీపీఐ మండల కార్యదర్శి నరసారావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి అప్పులపాలయ్యారని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి దేవనకొండను కరువు మండలంగా ప్రకటించాలని కోరారు.రైతులకు ఎకరాకు రూ.50 వేల పంట నష్టపరిహారం ఇవ్వాలని, పంటల బీమాను 100 శాతం అమలు చేయాలని, బ్యాంకు రుణాలను రూ.2 లక్షల వరకు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కరువు మండలంగా ప్రకటించే వరకు రైతుల సహకారంతో ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.దీక్షలకు వైఎస్సార్‌సీపీ సంఘీభావంరిలే దీక్షల శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ సభ్యులు రామకృష్ణ (కిట్టు), వై.అంజి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించే వరకు రైతాంగానికి అండగా ఉంటామని పేర్కొన్నారు.దీక్షల్లో నరసారావు, యూసుఫ్‌భాషా, పాండురంగడు, బడేసాబ్, రంగడు, నాగన్నస్వామి, సుబ్బయ్యశెట్టి, గంగన్న, మద్దిలేటి, తిప్పతల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 07:-రైల్వే కోడూరు నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమష్టిగా, సమన్వయంతో కష్టపడి పనిచేయాలని రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ బాధ్యులు, కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి సూచించారు. రైల్వే కోడూరులోని రాజ్ కన్వెన్షన్‌లో ముక్కా రూపానంద రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి టీడీపీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తిరుపతి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకుడు నూకసాని బాలాజీ, రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు, రైల్వేకోడూరు నియోజకవర్గ రెగ్యులర్ అబ్జర్వర్ నాగేశ్వరరావు, కస్తూరి విశ్వనాథ నాయుడు, మాచినేని విశ్వేశ్వర్ నాయుడు, కేకే చౌదరి, పంతగాని నరసింహ ప్రసాద్, నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తల తో పాటు యువనేత ముక్కా సాయి వికాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు. ఐదు మండలాల్లో పార్టీని మరింత పటిష్టం చేస్తూ, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. కూటమి అభ్యర్థుల విజయమే ప్రధాన లక్ష్యంగా ప్రతి మండలంలో సమష్టి కృషి చేయాలని, పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని ముక్కా రూపానంద రెడ్డి కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సమన్వయంతో కార్యాచరణ రూపొందించుకుని, కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పులివెందుల పట్టణంలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

● లాడ్జీలలో రికార్డులు పరిశీలన

● నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

● ఎస్సైలు హుస్సేన్,ఘన మద్దిలేటి



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 07:పులివెందుల పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు పలు లాడ్జీలలో ముమ్మరంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్,ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు,పులివెందుల డి.ఎస్పీ బి.మురళి పర్యవేక్షణలో ఈ తనిఖీ కార్యక్రమం చేపట్టారు.ఈ క్రమంలో చక్రాయపేట, సింహాద్రిపురం పోలీస్ స్టేషన్ల ఎస్సైలు హుస్సేన్,ఘన మద్దిలేటి తమ సిబ్బందితో కలిసి పట్టణ పరిధిలోని లాడ్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు.లాడ్జీలలో బస చేస్తున్న వ్యక్తుల వివరాలు,గుర్తింపు కార్డులు,రిజిస్టర్ల నిర్వహణ తీరును తనిఖీ చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. అధికారులు లాడ్జీ నిర్వాహకులకు పలు కీలక సూచనలు చేశారు.లాడ్జీలలో గదులు కేటాయించే ముందు ప్రతి ఒక్క అతిథి ఆధార్ కార్డు లేదా గుర్తింపు కార్డును తప్పనిసరిగా సేకరించి రికార్డుల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని హెచ్చరించారు.నిబంధనలు పాటించని నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తేల్చిచెప్పారు.ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి అక్టోబర్ 07:-ప్రొద్దుటూరు పట్టణంలోని సుందరాచార్యుల వీధిలో పీర్ల సావిడి నుంచి వైఎస్సార్ మహిళా పార్కు వరకు చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఏపీ స్టేట్ షేక్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. వి.ఎస్. ముక్తియార్, టీడీపీ ప్రొద్దుటూరు పట్టణ ఉపాధ్యక్షుడు కె. ఖలీల్ భాషా కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన రహదారి కల్పించేందుకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే పరిసర ప్రాంతాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, ఎలాంటి జాప్యం లేకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఒక లేఖతో మొదలైన ప్రయాణం.. 27,500 ఎకరాలకు నీటి భరోసా

● రూ.745 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పైప్ ఇరిగేషన్ ప్రాజెక్టు

పత్తికొండ, అక్టోబర్ 07 (మన జనప్రగతి):

పత్తికొండ ప్రాంత రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు చేపట్టిన ప్రయత్నం ముందుకు సాగుతోంది. 2025లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లి 27,500 ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రాజెక్టు ప్రతిపాదనను అందించారు.మూడు మండలాల్లోని 16 గ్రామాలకు సాగునీరు అందించేలా రూ.745 కోట్ల అంచనా వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పైప్ ఇరిగేషన్ ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. పైపుల ద్వారా పొలాలకు నీటిని అందించే ఈ ప్రాజెక్టు పూర్తయితే నీటి కొరత, భూగర్భ జలాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. దీంతో పత్తికొండ రైతుల్లో సాగునీటిపై ఆశలు పెరుగుతున్నాయి.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

- మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినులకు ఘనత



ఆదోని, మన జనప్రగతి అక్టోబర్ 07:కర్నూలులో నిర్వహించిన 70వ ఎస్‌జీఎఫ్ పోటీల్లో ఆదోని మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్17 బాలికల విభాగంలో దుర్గ, గంగోత్రి, అండర్19 బాలికల విభాగంలో అస్రా విమల రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ఎస్. సుధాకర్‌బాబు తెలిపారు.రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు దసరా సెలవుల అనంతరం నిర్వహించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణ, రోజా బి. తెలిపారు. విద్యార్థినులు రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది ఆకాంక్షించారు.

వైఎస్ జగన్‌తో దేశం సుధాకర్‌రెడ్డి దంపతుల భేటీ

- తాడేపల్లిలో మర్యాదపూర్వక కలయిక

- పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చ



నంద్యాల మన జనప్రగతి అక్టోబర్ 07: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేశం సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దేశం సులోచన దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలో జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై వారు చర్చించారు.ప్రధానంగా పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో నెలకొన్న ప్రజా సమస్యలపై వారు జగన్‌తో చర్చించారు.

హస్తిన పర్యటనలో ముఖ్యమంత్రితోఎంపీ బైరెడ్డి శబరి మర్యాదపూర్వక భేటీ



నంద్యాల మన జనప్రగతి అక్టోబర్ 07:

ఢిల్లీ పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్‌సభ తెదేపా డిప్యూటీ ఫ్లోర్ లీడర్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం సాయంత్రం న్యూఢిల్లీ వేదికగా సీఎం చంద్రబాబుకు ఆమె సాదర స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి ఎంపీ శబరి శుభాకాంక్షలు తెలిపారు. హస్తిన పర్యటనకు వచ్చిన అధినేతను కలవడం సంతోషంగా ఉందని, ఈ మేరకు సీఎంకు న్యూఢిల్లీలో ఘనంగా స్వాగతం పలికినట్లు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఒక ప్రకటనలో తెలిపారు.

ఓటును కాపాడుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి

● కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్



కడప మన జనప్రగతి అక్టోబర్ 07: –ఓటును కాపాడుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఓటరుపై ఉందని బుధవారం కడప నగరం వైయస్సార్ ప్రెస్ క్లబ్లో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్ ఆధ్వర్యంలో సమావేశం జరిగినది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం నగర కార్యదర్శి రామ మోహన్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులు బాదుల్లా సాగిరి గుర్రప్పపాల్గొని మాట్లాడుతూ..ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలనే దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా తక్షణం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, సుప్రీంకోర్టు విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేసిన జ్ఞానేష్ కుమార్ భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తెచ్చే కుట్రలో భాగంగానే ఓట్ల చోరీకి పాల్పడుతున్నారన్నారు.ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండానే ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని ఎన్నికల వ్యవస్థను జ్ఞానేష్ కుమార్ నిర్వీర్యం చేశారన్నారు. ఓటు విలువను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర ఉపాధ్యక్షులు అంజన్ కుమార్, సౌదాగర్ సాదిక్, షేక్ ఫజురుల్లా, డివిజన్ ఇన్‌చార్జ్‌లు సిద్దిక్, షేక్ అన్వర్, సయ్యద్ అన్వర్, నాయకులు మహబూబ్ బాషా, మురాద్ భాష, హాజీ, గఫార్, సర్దార్ భాష, ఖాజా పీర్, ఆరిఫ్, జమీల్, యూసుఫ్, సుబ్రహ్మణ్యం, రమేష్, అక్రమ్, అమీజాఖానం, నసీమునిసా తదితరులు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై అధికారుల కీలక సమీక్ష



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 07:– త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, విధివిధానాలపై బుధవారం పులివెందుల కార్యాలయంలో మున్సిపల్,పోలీస్ ఉన్నతాధికారులు సంయుక్తంగా కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శివ తనూజ, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ చిన్నయ్య,డీఎస్పీ మురళీ నాయక్,అర్బన్ సీఐ పురుషోత్తమ రాజు,రూరల్ సీఐ శాంతి లాల్‌తో పాటు పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.నియోజకవర్గంలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో,పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు,భద్రతా చర్యలపై అధికారులు సమగ్రంగా చర్చించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను,ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా అమలు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిఘా పటిష్టం చేయడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు

గ్రామపంచాయతీ వర్కర్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 07:–ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) చిట్వేలి మండల నూతన కమిటీ ఎన్నికైంది. చిట్వేలి పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి ఏఐటీయూసీ రైల్వేకోడూరు నియోజకవర్గ అధ్యక్షులు మాదరాజు గంగాధర్, ప్రధాన కార్యదర్శి దాసరి జయచంద్ర హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు తక్కువ వేతనాలతో గ్రామాల పరిశుభ్రతకు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని, పెండింగ్ జీతాలు విడుదల చేసి ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, హెల్త్ కార్డులు కల్పించాలని డిమాండ్ చేశారు. పనిముట్లు, యూనిఫాం, భద్రతా పరికరాలు అందించాలని, ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని కోరారు.జనాభా పెరుగుతున్నా గ్రామపంచాయతీ కార్మికుల సంఖ్య పెరగడం లేదని, వెంటనే ఖాళీలను భర్తీ చేసి సిబ్బందిని పెంచాలని అన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.చిట్వేలి మండల కమిటీ అధ్యక్షుడిగా మంచాల నరేష్, కార్యదర్శిగా కామ్రేడ్ గుర్రాల సుబ్బరాయుడు, కోశాధికారిగా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా కృష్ణవేణి, ఈశ్వరమ్మ, పద్మ, సహాయ కార్యదర్శులుగా చల్లప్ప, పోలయ్య, చిన్నయ్య ఎంపికయ్యారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పెంచలయ్య పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 40మంది ఎంపిక



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 07:–చిట్వేలి గ్రామ పంచాయితీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 40మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించి 20 మందిని కడప ఆసుపత్రికి తరలించారు.మిగతా 20మందిని శుక్రవారం ఆపరేషన్ల కు తరలిస్తామని వైద్యులు తెలియజేశారు.చిట్వేలి మాజీసర్పంచ్ చౌడవరం.ఉమామహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి వారు పంచాయితీ కార్యాలయంలో ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 1.00 గంటవరకు ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 130 మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. వీరిలో 40మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు.మధ్యాహ్నం కంటి ఆపరేషన్లు కొరకు తరలించే వారికి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం,పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

● మునిసిపల్ ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి

● ఇస్లాంపురం,చిన్న కొండారెడ్డి కాలనీల్లో క్షేత్రస్థాయి పరిశీలన

● యూజీడీ, స్టార్మ్ వాటర్ డ్రైనేజీ సమస్యలపై అధికారులతో చర్చ



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 07:– పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిచ్చి చర్యలు తీసుకుంటామని వైఎస్ మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు.స్థానిక ఇస్లాంపురం, చిన్న కొండారెడ్డి కాలనీల్లో ఆయన విస్తృతంగా పర్యటించి,ప్రజలు ఎదుర్కొంటున్న యూజీడీ (అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ),స్టార్మ్ వాటర్ డ్రైనేజీ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కాలనీవాసులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.యూజీడీ పనుల కారణంగా దెబ్బతిన్న రోడ్ల పరిస్థితిని,వర్షాకాలంలో నీరు నిలవకుండా సాఫీగా వెళ్లేందుకు అవసరమైన స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులతో చర్చించారు.ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తక్షణమే మరమ్మతులు,ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు హాల్ గంగాధర్ రెడ్డి,పట్టణ ఉపాధ్యక్షులు పార్నపల్లి కిషోర్,మాజీ వైస్ చైర్మన్ హఫీజ్,స్థానిక నాయకులు,కార్యకర్తలు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్.ఓ.వాటర్ ప్లాంట్ ప్రారంభం

● విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ధ్యేయం: ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి



సింహాద్రిపురం మన జనప్రగతి అక్టోబర్ 07:సింహాద్రిపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్.ఓ.వాటర్ ప్లాంట్‌ను శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు.పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన మంచినీటిని అందించేందుకు ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి తనయుడు భూమిరెడ్డి సాయి శ్రీనివాస్ రెడ్డి తన ఉదారతతో ఈ వాటర్ ప్లాంట్‌ను విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, పరిశుభ్రమైన తాగునీటి కొరత లేకుండా చూసేందుకే ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.విద్యార్థులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్యంగా ఉండి, చదువుల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ (ఎంఆర్ఓ) అనురాధ, ఎంపీడీఓ శ్రీనివాసుల రెడ్డి, ఎంఈఓలు ఖాదర్ బాషా, అరుణ కుమారి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిచంద్ర,ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్వాడీ ఉత్సవాల్లో సేవా స్ఫూర్తికి ఘన సన్మానం



తొండూరు మన జనప్రగతి అక్టోబర్ 07: మండల పరిధిలోని తొండూరు అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి ఉత్సవాలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తల్లి బిడ్డల ఆరోగ్యము పోషణతో పాటు ప్రభుత్వ ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో అంగన్వాడి సిబ్బంది ఆశ కీలక పాత్ర పోషిస్తున్నారని బిజెపి నాయకులు తెలిపారు తొండూరు మండలంలోని 1,2,3 అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పులివెందుల బిజెపి మండల నాయకులు కేతిరెడ్డి తిరుపాల్ రెడ్డి, శివమోహన్ రెడ్డిలు,అంగన్వాడి కార్యకర్తలను సుజాత ,గురుతేజ,గాయత్రి లను హెల్పర్స్ పుల్లమ్మ,శ్రీదేవి,ఖాసింబి లను వారు సన్మానించడం జరిగింది.అంగన్వాడీ కార్యకర్తలు అందించే సేవలకు అభినందించారు.అనంతరం గర్భిణీ బాలింతలకు పోషణ సామాగ్రి వివరాలను, సేవా పథకాల గురించి తల్లులందరికీ తెలియ చెప్పారు.ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరియు ఐసిడిఎస్ సూపర్వైజర్ పి వసంత కుమారి మరియు హెల్త్ సూపర్వైజర్ ,ఏఎన్ఎం గర్భవతులు బాలింతలు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు ఆహ్లాదకర వాతావరణంలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు కేతిరెడ్డి తిరుపాల్ రెడ్డి, మండల టిడిపి నాయకులు వెన్నపూస శివమోహన్ రెడ్డి,అంగన్వాడీ సహాయకులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

వేంపల్లె పంచాయతీ సిబ్బంది సమస్యలు రెండు రోజుల్లో పరిష్కారం

• అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణతో పంచాయతీకి రూ.10 కోట్ల ఆదాయం: ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి




వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 07:-వేంపల్లె గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను రెండు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు జీవీ రమణ, ఇతర నేతలతో కలిసి పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందితో మాట్లాడారు.తమకు రెండేళ్లుగా పీఎఫ్, ఈపీఎఫ్, ఎల్ఐసీ డబ్బులు బకాయిలుగా ఉన్నాయని, మూడు నెలలుగా జీతాలు కూడా అందలేదని కార్మికులు ఎమ్మెల్సీకి ఫిర్యాదు చేశారు. అనంతరం పులివెందుల డీడీఓ, వేంపల్లె గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి గౌతు కట్ట వెంకటసుబ్బయ్య, ఈఓ గాండ్ల కవితతో ఆయన సమస్యలపై చర్చించారు.గతంలో పనిచేసిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంచాయతీ సిబ్బందికి చెల్లించాల్సిన పీఎఫ్, ఈపీఎఫ్, ఎల్ఐసీ సొమ్ము రూ. 69 లక్షలు పెండింగ్‌లో పడ్డాయని భూమిరెడ్డి తెలిపారు. ఇంటి పన్ను, నీటి పన్ను తదితర ఆదాయాల్లో అవకతవకలు జరిగిన విషయమై గతంలో ముగ్గురు ఈఓలను సస్పెండ్ చేసి కొంతమేర నగదు రికవరీ చేశారని, విచారణ కొనసాగుతోందన్నారు.సిబ్బంది సమస్యలను జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ దృష్టికి తీసుకెళ్లామని, సాఫ్ట్‌వేర్‌లో ఎడిట్ ఆప్షన్ ఇవ్వాల్సి ఉన్నందున రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. పంచాయతీలో ప్రస్తుతం నిధులు ఉన్నందున సిబ్బందికి చెల్లించాల్సిన బకాయిలను త్వరగా అందేలా చూస్తామన్నారు.పారదర్శక పాలన కోసం పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను తీసుకొచ్చారని తెలిపారు. ప్రజలు ఇంటి, నీటి పన్నులను నేరుగా పోర్టల్‌లో చెల్లించి రసీదు పొందవచ్చన్నారు. వేంపల్లె చుట్టుపక్కల ఉన్న అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరిస్తే పంచాయతీకి సుమారు రూ.10 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.పంచాయతీ పరిధిలోని క్రీడా స్టేడియం, పార్కు ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ హరీష్, టీడీపీ నాయకుడు ఏమిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడూరు కెనాల్‌పై అక్రమ కల్వర్టుపై నిబంధనల ప్రకారం చర్యలు

• ప్రజా ప్రయోజనం ఉన్నా అనుమతులు తప్పనిసరి

• మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్



ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి అక్టోబర్ 07:-ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని మడూరు కెనాల్‌పై మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మించినట్లు ఆరోపణలు వచ్చిన కల్వర్టుపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు స్థానిక టీడీపీ నాయకులు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు చేసిన ఫిర్యాదుపై మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కల్వర్టు నిర్మాణ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు స్థానిక ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఫిర్యాదుదారులు, మహిళలు, స్థానిక ప్రజలు, సంబంధిత వ్యక్తులతో మాట్లాడి వారి వాదనలను అధికారులు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కల్వర్టు నిర్మాణం స్థానిక ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని డాక్టర్ ఇంజినీర్ అమర్నాథ్ రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే ప్రజా ప్రయోజనం ఉన్నప్పటికీ ప్రభుత్వ పరిధిలోని నిర్మాణాలు చేపట్టే సమయంలో సంబంధిత శాఖల అనుమతులు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. స్థానిక ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుంటూనే పట్టణంలో చేపట్టే నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. సంఘటనా స్థల పరిశీలన, అందిన ఫిర్యాదు, స్థానికుల అభిప్రాయాలు, నిర్మాణానికి సంబంధించిన అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూనే పట్టణ ప్రణాళిక, ప్రభుత్వ ఆస్తులు, డ్రైనేజీ వ్యవస్థ, నిర్మాణ నిబంధనల పరిరక్షణకు మున్సిపల్ యంత్రాంగం కట్టుబడి ఉందని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్‌తో పాటు అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణసింగ్, టౌన్ ప్లానింగ్ అధికారి చంద్రమోహన్, మున్సిపాలిటీ అసిస్టెంట్ ఇంజినీర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 07:-ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు.బుధవారం ఎమ్మెల్సీ ఆర్‌జీయూకేటీ ఆర్.కే.వ్యాలీ క్యాంపస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన క్యాంపస్‌లోని విద్యార్థులతో ముఖా ముఖి గా మాట్లాడి,వారి విద్యా ప్రగతి,విద్యా సదుపాయాలు,మెస్‌లో అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సానుకూలంగా స్పందిస్తూ, క్యాంపస్ లోని సదుపాయాలు,మెస్ నిర్వహణ పట్ల తమ సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం ఎమ్మెల్సీ డైరెక్టర్ కార్యాలయంలో విశ్వవిద్యాలయ యాజమాన్యంతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ జి. విజయ ప్రకాశ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. సి.హెచ్.రత్న కుమారి క్యాంపస్‌కు సంబంధించిన పలు కీలక అంశాలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు.ముఖ్యంగా అసంపూర్తిగా ఉన్న ఆడిటోరియం నిర్మాణ పనులను పూర్తి చేయడం, క్యాంపస్ ఆసుపత్రికి అవసరమైన మందుల సమకూర్పు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి తదితర పెండింగ్ సమస్యలను వివరించారు.ఈ అంశాలపై ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. క్యాంపస్ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, క్యాంపస్ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీకి డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ ప్రకాశ్ కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు జీవీ రమణ, ట్రిపుల్ ఐటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

• జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు



వేంపల్లె మన జనప్రగతి అక్టోబరు 07:-భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు పేర్కొన్నారు.వేంపల్లె నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో భవన నిర్మాణ కార్మికులకు ఆయన గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్డు కలిగిన కార్మికులకు ప్రమాదాలు, అనుకోని అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు సంఘం తరఫున వివిధ రకాల ఆర్థిక సహాయాలు అందే అవకాశం ఉంటుందని చెప్పారు.కార్మికుల కుటుంబాల్లో జరిగే వివాహాలకు రూ.20 వేల వరకు, ప్రసవ ఖర్చులకు రూ.20 వేల వరకు,ప్రమాదవశాత్తు మరణించిన సందర్భంలో అంత్యక్రియల ఖర్చులకు రూ.20 వేల వరకు, సహజ మరణం సంభవించినప్పుడు రూ.60 వేల వరకు ఆర్థిక ప్రయోజనం లభిస్తుందని వివరించారు. మొత్తంగా వివిధ ప్రయోజనాల ద్వారా కార్మికులకు గరిష్ఠంగా రూ.80 వేల వరకు లబ్ధి చేకూరే అవకాశం ఉందన్నారు.భవన నిర్మాణ కార్మికులకు మరింత అండగా నిలిచేలా ప్రభుత్వం అదనపు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ప్రమాదాలు, థర్డ్‌పార్టీ వల్ల కలిగే ఇబ్బందులు తదితర సందర్భాల్లో కూడా కార్మికులకు మెరుగైన రక్షణ, ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.అర్హులైన భవన నిర్మాణ కార్మికులు వివాహం, ప్రసవం, సహజ మరణం తదితర సంక్షేమ ప్రయోజనాల కోసం తమ పరిధిలోని సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని లేబర్ శాఖ అధికారులు సూచిస్తున్నారని తెలిపారు. అయితే వేంపల్లె మండలంలోని కొన్ని సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరించడం లేదని సిబ్బంది చెబుతున్నారని, దీనిపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి కార్మికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని పలు సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ జరుగుతున్నప్పటికీ వేంపల్లె మండలంలో సౌకర్యం అందుబాటులో లేదని పేర్కొన్నారు.భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ ప్రయోజనాలు అందించేలా చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వానికి సంఘం తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో భవన కార్మికుల సంఘం నాయకులు బాలాజీ, నాగేశ్వరరావు, భాషా, బాబా, ఫక్రుద్దీన్, శివ, శీను, వెంకటేష్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలను విజయవంతం చేయండి

- దసరా ఉత్సవాల ఆహ్వాన పుస్తకాల ఆవిష్కరణ



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 07:-వేంపల్లె పట్టణంలో 122 సంవత్సరాలు చరిత్ర గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహి ంచే 2026 దసరా ఉత్సవాలను అందరూ విజయవంతం చేయాలని వేంపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు స్థానిక మెయిన్ బజార్ లోని అమ్మవారి శాలలో దసరా శరన్నవరాత్ర ఆహ్వాన పుస్తకాలను ఆయన కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు.ముందుగా ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఆలయంలో దసరా ఉత్సవాల ఆహ్వాన పుస్తకాలను పూజించి ఆవిష్కరించారు.ఈ నెల 11వ తేది నుంచి 21వ తేది వరకు దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 10 రోజుల పాటు వాసవి మాత వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.ఉత్సవాల్లో భాగంగా 20వతేది రాత్రి వివిధ వేషధారణలు,మంగళ వాయిద్యాలు,కనక తప్పెట్లు, బాణసంచాలు,విద్యుత్ దీపాల నడుమ వాసవి మాత గ్రామోత్సవంఅత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు.ప్రతి రోజు శ్రీ వాసవి కళ్యాణ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు,తదితర వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.ఈ సందర్భంగా దసరా ఉత్సవాల వివరాలు, విశిష్టత,ఆధ్యాత్మికత,సాంస్కృతిక సంప్రదాయాలను,ఉత్సవాల్లో అమ్మవారి అలంకారాల వివరాలు ప్రజలకు చేరువ చేసేలా ప్రత్యేక పుస్తకాలను రూపొందించినట్లు తెలిపారు.ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలకు భారీ స్వాగత ముఖద్వారాలు,పందిర్లు,ఆలయంలో విద్యుత్ దీపాలంకరణతో పాటి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం,ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి కళ్యాణ మండపం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డిజిటల్ యుగంలో అప్రమత్తత అవసరం

• యూసీఐఎల్ ఉద్యోగులకు సైబర్ భద్రతపై శిక్షణ • ఐటీ నేరాలపై ప్రొఫెసర్ వినోద్‌కుమార్ అవగాహన • జీఈఎం కొనుగోళ్లపై ఎస్.కె.బర్మన్ వివరణ



వేముల మన జనప్రగతి అక్టోబర్ 07:-డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు,ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తత ఎంతో అవసరమని చెన్నై ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సి.ఎన్.ఎస్. వినోద్‌కుమార్ అన్నారు. యూసీఐఎల్ తుమ్మలపల్లె యూనిట్ జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులకు సైబర్ భద్రతపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.కార్యక్రమంలో ప్రొఫెసర్ సి.ఎన్.ఎస్. వినోద్‌కుమార్ ఐటీ నేరాలు, బ్యాంకింగ్ మోసాలు, డిజిటల్ మోసాలు, సైబర్ ముప్పులపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ వేదికలు, ఎలక్ట్రానిక్ సమాచార మార్పిడి సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత మరియు సంస్థాగత సమాచార భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అనంతరం ఎస్.కె. బర్మన్ జీఈఎం ద్వారా ప్రభుత్వ కొనుగోళ్ల విధానం, నిబంధనల అమలు, కొనుగోలు ప్రక్రియలో పాటించాల్సిన విధానాలపై వివరించారు. కొనుగోళ్లలో పారదర్శకత, సమగ్ర పరిశీలన, నిబంధనల పాటింపు, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.విజిలెన్స్ అనేది కేవలం ఒక విభాగానికి సంబంధించిన బాధ్యత కాదని, సంస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగి సమిష్టి బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు. సైబర్ మోసాలు, ఆర్థిక అక్రమాలు, కొనుగోలు విధానాలు, నైతిక విలువలపై ఉద్యోగులు నిరంతరం అవగాహన పెంచుకోవాలని సూచించారు.



యూసీఐఎల్ స్థాపనకు ఆరు దశాబ్దాలు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థలో నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం, విజిలెన్స్‌తో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా వినియోగించే సంస్కృతిని మరింత బలోపేతం చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్,కిషోర్ భగత్,ఎస్.కె. శర్మ,డాక్టర్ బి.ఎన్.కె.రెడ్డి, టి.సి.ఎస్.రెడ్డి, ఎన్.వి.రెడ్డి, పి.వి.ఎన్.కుమార్ శర్మ,ఎన్.వి.రాజేష్,వేణుగోపాల్‌రెడ్డి,చి.కిషోర్,సంతోష్, ఎం.వి.నరేంద్ర,ఎల్.కోటేశ్వరరావు,పి. శ్రీహర్ష,ఎల్.రాజేష్,గణేష్ ఎస్.ఎస్.,ఎం.సాంబశివరెడ్డి తదితర అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల్లో తీరని అన్యాయం: మాజీ సైనికుడి ఆవేదన

ఫైలు కదలడం లేదు.. కొర్రీలతో వేధిస్తున్నారు

సీఎం,డిప్యూటీ సీఎం న్యాయం చేయాలని పులివెందుల బాధితుడు విజయ్ కుమార్ రెడ్డి వేడుకోలు



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 07: తండ్రి మృతితో తనకు దక్కాల్సిన కారుణ్య నియామక ఉద్యోగాన్ని ఇవ్వకుండా అధికారులు నిరాకరిస్తూ తీవ్ర అన్యాయం చేస్తున్నారని వైఎస్సార్ జిల్లా పులివెందులకు చెందిన మాజీ సైనికుడు సగిలి విజయ్ కుమార్ రెడ్డి ఆరోపించారు.బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయ్ కుమార్ రెడ్డి తన గోడును వెల్లడించారు.2021లో కరోనా సమయంలో తన తండ్రి అనారోగ్యంతో మృతి చెందారని అనంతరం 2022లో కారుణ్య నియామకం కింద ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.డిగ్రీ అర్హత ఉన్నందున జూనియర్ అసిస్టెంట్ పోస్టు కోసం ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులతో వెయిటింగ్ లిస్ట్‌లో చేరినట్లు వివరించారు.అయితే తాను మాజీ సైనికుడినని,పెన్షన్ వస్తోందని, వయోపరిమితి దాటిపోయిందంటూ జిల్లా పరిషత్ అధికారులు ఉద్దేశపూర్వకంగా కొర్రీలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.హైకోర్టు ఆదేశాల ప్రకారం పెన్షన్ అనేది ఆదాయం కాదని ఆధారాలు చూపించినా అధికారులు పట్టించుకోలేదన్నారు.పైగా తాను తెచ్చిన ఉత్తర్వుల సర్టిఫికెట్‌ను ఫోర్జరీ చేసి 13 మంది జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు పొందారని, విచారణ జరిగినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.గత ఏప్రిల్‌లో వయోపరిమితి సడలింపు (ఏజ్ రిలాక్సేషన్) కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు ఫైలు ముందుకు కదలడం లేదని వాపోయారు. జడ్పీ,కమిషనరేట్,ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయాల చుట్టూ ఫైలు తిరుగుతోందే తప్ప సమస్య పరిష్కారం కావడం లేదన్నారు.కేవలం వినతిపత్రాలు ఇస్తే సరిపోదని,ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని స్పష్టమైన ఆదేశాలు ఇస్తేనే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.తన సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు చెప్పుకుంటే న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో ఇటీవల జనసేన కేంద్ర కార్యాలయానికి వెళ్లినప్పటికీ ఆయన్ను కలిసే అవకాశం దక్కలేదన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోవడం,తన గళం అధినేతకు వినబడాలనే తీవ్ర మనస్తాపంతోనే అక్కడ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడాల్సి వచ్చిందని ఆవేదన చెందారు.గత ఆరేళ్లుగా తాను తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నానని తెలిపారు.ఈ వ్యవహారంలో ముఖ్య మంత్రి,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్,మంత్రి నారా లోకేష్ తక్షణమే స్పందించి,తన కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కారుణ్య నియామకం ద్వారా తనకు ఉద్యోగం వచ్చేలా న్యాయం చేయాలని విజయ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

టీడీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

● స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేయాలి:ముక్కా సాయి వికాస్‌రెడ్డి



ఓబులవారిపల్లె మన జనప్రగతి అక్టోబర్ 07: –రైల్వేకోడూరు నియోజకవర్గంలో టీడీపీని మరింత బలోపేతం చేయడంతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని టీడీపీ యువ నాయకులు ముక్కా సాయి వికాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రైల్వేకోడూరు టీడీపీ కార్యాలయంలో యువకులు, పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వేకోడూరు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.భారత సైనికులు దేశ రక్షణ కోసం అంకితభావంతో పనిచేసినట్లే టీడీపీ కార్యకర్తలు పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేయాలని కోరారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేయాలి

- కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదు:గడికోట శ్రీకాంత్‌రెడ్డి



లక్కిరెడ్డిపల్లె మన జనప్రగతి అక్టోబర్ 07:రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. లక్కిరెడ్డిపల్లె మండలంలో వైఎస్సార్‌సీపీలో వివిధ హోదాల్లో బాధ్యతలు చేపట్టిన వారికి బుధవారం గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాంత్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ పరిశీలకులు రెడ్డెప్పగారి రమేష్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అన్నారు. పార్టీ సభ్యత్వం ఉన్న కార్యకర్త ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా అందేలా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కరువు పరిస్థితుల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై పోరాడుతూ స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని కోరారు.కార్యకర్తలను బెదిరింపులు, అక్రమ కేసులతో అణచివేయడం సాధ్యం కాదని శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యకర్తలకు తాను, రమేష్‌కుమార్‌రెడ్డి అండగా ఉంటామని తెలిపారు. రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గుర్తింపు కార్డుల ద్వారా కార్యకర్తలకు గౌరవం, బాధ్యత కల్పిస్తున్నామని తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు.మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, కాలాడి ప్రభాకర్‌రెడ్డి, సయ్యద్ అమీర్, సమరసింహారెడ్డి, వెంకట నారాయణరెడ్డి, దిన్నెపాడు సుబ్బరాజు, సుబ్బరాయుడు, బాబ్జాన్, నరసింహారెడ్డిలు పాల్గొన్నారు. మండలంలోని మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మైనార్టీ నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

కూటమి ప్రభుత్వ లక్ష్యం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం

● ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ధ్యేయం: టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి



కడప మన జనప్రగతి అక్టోబర్ 07:–ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి అన్నారు. కడప నగరం అక్కాయపల్లెలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అమరజీవి జలధార సభకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.30 వేల కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు.సభ విజయవంతం కావడాన్ని జీర్ణించుకోలేక వైసీపీ నేతలు విమర్శలు చేయడం సరికాదని భూపేష్‌రెడ్డి అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతుంటే వైసీపీ నేతలు విమర్శలు చేయడం వారి చేతకానితనానికి నిదర్శనమన్నారు.కడప జిల్లా నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులు పనిచేసినప్పటికీ ప్రజలకు తాగునీరు అందించలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. చేయని పనులను చేసినట్లుగా చెప్పుకోవడం వైసీపీ నేతలకే చెల్లిందన్నారు.మిషన్ రాయలసీమ ద్వారా రాయలసీమ సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోందన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు సెజ్‌ల అభివృద్ధితో పారిశ్రామిక రంగానికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాయలసీమలో సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో హార్టికల్చర్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి విజయం సాధిస్తామని భూపేష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో జయసుబ్బారెడ్డి, బొమ్మిశెట్టి చంద్ర, జబీవుల్లా, మన్నూర్ అక్బర్, మీడియా కోఆర్డినేటర్ జనార్దన్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు ప్రజల తాగునీటి సమస్యపై ఎంపీడీవో స్పష్టత ఇవ్వాలి

● పీలేరు మండలంలో అసలు నీటి కొరత ఉందా.?

● ఉంటే అధికారులు తీసుకుంటున్న చర్యలేంటి.?

● ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ



పీలేరు మన జనప్రగతి అక్టోబర్ 07: పీలేరు మండలంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, నీటి అవసరం ఉన్న ప్రాంతాలకు దాతలు ముందుకు వచ్చి నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారని గత కొన్ని రోజులుగా పత్రికల్లో వార్తలు వస్తున్నాయని ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ పేర్కొన్నారు.ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో దాతలు ముందుకు వచ్చి నీటిని అందించడం అభినందించాల్సిన విషయమని ఆయన అన్నారు.అయితే అసలు పీలేరు మండలంలో తాగునీటి కొరత ఉందా? లేదా? అనే విషయంపై ఎంపీడీవో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు.ఒకవేళ నిజంగా తాగునీటి కొరత ఉంటే, ఏయే ప్రాంతాల్లో నీటి సమస్య ఉంది, ఆయా ప్రాంతాలకు అధికార యంత్రాంగం ఎలాంటి నీటి సరఫరా చర్యలు చేపడుతోంది, ప్రస్తుతం ఎన్ని ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు, ఎంతమంది ప్రజలకు నీరు అందుతోంది, సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు అనే వివరాలను ఎంపీడీవో వెల్లడించాలని కోరారు.అలాగే పీలేరు ఎమ్మెల్యే కూడా ఈ అంశంపై స్పందించి, మండలంలోని తాగునీటి పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రజలకు అవసరమైన నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని మద్దెల అమృత్ తేజ కోరారు.తాగునీరు ప్రజల ప్రాథమిక అవసరం. దాతల సేవకు అభినందనలు. అయితే తాగునీటి సమస్యపై వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేసి,అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది అని ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి

ప్రత్యేక వేదిక

● తొండూరులో రేపు 'ఒక నియోజకవర్గం.. నాలుగు సందర్శనలు' ● ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: తహసీల్దార్ మధురవాణి

తొండూరు మన జనప్రగతి అక్టోబర్ 07: –ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికగా రేపు (శుక్రవారం) తొండూరు మండలంలో 'ఒక నియోజకవర్గం.. నాలుగు సందర్శనలు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మధురవాణి పేర్కొన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలు, వినతులను స్వీకరించనున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని మధురవాణి తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరేలా దినపత్రికల్లో ప్రచురించాలని, కార్యక్రమం కవరేజీకి మీడియా ప్రతినిధులు సహకరించాలని తహసీల్దార్ మధురవాణి విజ్ఞప్తి చేశారు.

పీలేరు ఆర్డీఓ కార్యాలయానికి కంప్యూటర్,స్కానర్ ప్రింటర్ అందజేత

- సేవా కార్యక్రమాలతో యాక్ట్స్ సంస్థ అభినందనీయం



పీలేరు మన జనప్రగతి అక్టోబర్ 07:- పీలేరు ఆర్డీఓ కార్యాలయానికి యాక్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో అధునాతన సాంకేతిక సౌకర్యాలతో కూడిన కంప్యూటర్, స్కానర్ ప్రింటర్‌ను బుధవారం అందజేశారు. యాక్ట్స్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ జి. దశరథ్‌రెడ్డి ఈ పరికరాలను సమకూర్చారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి యాక్ట్స్ సంస్థ ద్వారా డాక్టర్ దశరథ్‌రెడ్డి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని విద్యాసంస్థలకు విద్యా సామగ్రి, ఫర్నిచర్, బీరువాలు, టేబుళ్లు, కంప్యూటర్లు, ఇతర మౌలిక వసతులను అందిస్తూ విద్యార్థులకు సహకారం అందిస్తున్నారు.ఇందులో భాగంగా పీలేరు ఆర్డీఓ కార్యాలయంలో ప్రజలకు అందించే సేవలను మరింత వేగవంతం చేసేందుకు కంప్యూటర్, స్కానర్ ప్రింటర్‌ను అందించారు. కార్యాలయ కార్యకలాపాలను సులభతరం చేయడంలో ఈ పరికరాలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. దశరథ్‌రెడ్డి సేవా కార్యక్రమాలను వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె. విజయలక్ష్మి, ఏవో నరసింహకుమార్, గూడరేవుపల్లికి చెందిన ద్వారకరెడ్డి, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174